
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 7 నవంబరు 2024



రేపు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఎల్ఎన్వీ శ్రీధర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశాలు జరుగుతాయని అన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

బిడ్డకు అభయమేదీ!

- జిల్లాలో అధికమవుతున్న శిశు మరణాలు
- గిరిజన గ్రామాల్లోనే ఎక్కువ
- తల్లులూ మృత్యుబారిన పడుతున్న వైనం
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

● మెళియాపుట్టి మండలం దబ్బగుడ్డి గ్రామానికి చెందిన చిన్నంటి సుమలత అనే గర్భిణికి ఈ ఏడాది మే 8న ఇంటి వద్ద ప్రసవం జరిగింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, ప్రసవం జరిగిన 15 రోజులకే సుమలత మృతి చెందింది. పురిటినొప్పులు వచ్చిన సమయంలో ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక గ్రామానికి వాహనాలు రాలేదు. దీంతో ఇంటి వద్ద ప్రసవం చేశారు. అయితే, సక్రమంగా డెలివరీ అయింది కదా అని తరువాత ఆసుపత్రికి వెళ్లలేదు. ఏం జరిగిందో గాని ఆమె చనిపోయింది. దీంతో ఆ కుటుంబం రోదన అంతా ఇంతాకాదు.

● మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల ఓ యువకుడి కారణంగా గర్భం దాల్చింది. దీనిపై టెక్కలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇద్దరూ మైనర్లు కావటంతో వివాహం చేసుకోలేదు. ఇంతలో ఆ బాలిక పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, శిశువుకు పచ్చకామర్లు వచ్చి మృతి చెందింది.

జిల్లాలో ఏటా శిశు మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గత నాలుగేళ్లలో 1,229 శిశు మరణాలు సంభవించాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో మాతాశిశు మరణాల సంఖ్య ఎక్కువగా నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి గిరిజనుల్లో అవగాహన లేకపోవడం ఒక కారణమైతే.. ఆ గ్రామాల్లో సౌకర్యాలు మృగ్యం కావడం మరో కారణం. ప్రసవ సమయంలో వారు ఆస్పత్రులకు రాకుండా ఇళ్ల వద్దే కాన్పులు చేస్తుండడంతో కొన్నిసార్లు తల్లీబిడ్డలు మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో శిశుమరణాల రేటును తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

6లో



ముందే గుర్తిస్తే మేలు

- ప్రాథమిక స్థాయిలో చికిత్స అందిస్తే సేఫ్
- జిల్లాలో పెరుగుతున్న కేన్సర్ బాధితులు
- చెడు వ్యసనాలు, జంక్ ఫుడ్డే కారణం
- అవగాహన లేక నిర్లక్ష్యం.. ఆపై మూల్యం
- నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం

కేన్సర్ లక్షణాలను ముందే గుర్తిస్తే వ్యాధిని నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ సంవ త్సరానికి ఒకసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో చికిత్స అందిస్తే ప్రాణాలతో బయటపడొచ్చు. ల్యాప్రోస్కోపిక్ తరహాలోనే కీహోల్ సర్జరీలు సైతం నేడు అందుబాటులోకి వచ్చాయి.

6లో



చెప్పిందొకటి.. చేసిందొకటి..



విదేశాల్లో ఉద్యోగమంటారు. రూ.లక్షలు వచ్చి పడతాయంటారు. కుటుంబాన్ని బాగా చూసుకోవచ్చని చెబుతారు. ఎక్కడోచోట చిన్నపాటి ఆఫీసు పెట్టుకుంటారు. అక్కడికి పిలిచి ఇంటర్వ్యూలు చేస్తారు. రూ.లక్షలు వసూలు చేస్తారు. ఇంకొన్ని మాయమాటలు చెప్పి విమానం ఎక్కిస్తారు. పరదేశంలో అడుగిడగానే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. చెప్పిన ఉద్యోగం ఒకటి.. అక్కడ ఇచ్చే ఉద్యోగం మరొకటి. ప్రశ్నిస్తే పాస్‌పోర్టు ఇవ్వరు.. ఆపై వేధింపులు. వెలుగులోకి వచ్చినవి కొన్నే ఉండగా.. రానివి ఎన్నో! అక్కడే చనిపోతే కుటుంబీకులకు కూడా తెలియని పరిస్థితి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. పోలీసులు కూడా తమకెలాంటి ఫిర్యాదు రాలేదని చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ మోసాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు? బాధితులకు న్యాయం దక్కేదెప్పుడు? ఉన్నతస్థాయిలో జోక్యం చేసుకుంటేనే ఇది సాధ్యమవుతుంది.

- విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలు
- ఇచ్ఛాపురంలో వారం వారం ఇంటర్వ్యూలు
- బోగస్ సంస్థలే అధికం
- మోసపోతున్న నిరుద్యోగ యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఇచ్ఛాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)

ఎవరికైనా విదేశాల్లో ఉద్యోగం చేయడం ఓ కల. దీన్ని నెరవేర్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, జిల్లాకు చెందిన కొందరు యువకులు విదేశాల్లో ఉద్యోగం కోసం బోగస్ సంస్థలను నమ్మి మోసాలబారిన పడుతున్నారు. ఆ సంస్థలు ఇంటర్వ్యూల సమయంలో చెప్పిన పనులు ఒకటి.. విదేశాలకు వెళ్లిన తరువాత అప్పగించిన పనులు మరొకటిగా ఉంటున్నాయి. ఇప్పటికే మంచి కంపెనీల్లో పనిచేసే వారి ద్వారా వెళుతున్న వారికి పర్వాలేదు. కానీ, దళారుల ద్వారా వెళుతున్న వారే ఎక్కువగా మోసాల బారిన పడుతున్నారు. అయితే, నేడు దళారులు గ్రామాల్లోకి సైతం వచ్చి ఆకర్షణీయమైన జీతం అంటూ నిరుద్యోగ యువతను ఆకర్షిస్తున్నారు. అధిక మొత్తంలో గుంజుకొని మోసాలకు పాల్పడుతున్నారు.



ఇచ్ఛాపురం సురంగి రాజా మైదానం సమీపంలో ఓ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ వద్ద గుమిగూడిన జనాలు

ఉద్దానం నుంచి అధికం..

జిల్లాలో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎక్కువగా విదేశాలకు వెళుతుంటారు. భవన నిర్మాణంతో పాటు పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తుంటారు. సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల యువకులు ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. పదో తరగతి వరకూ చదవడం.. వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్‌గా శిక్షణ తీసుకోవడం.. తరువాత ఉపాధి బాట పట్టడం ఉద్దానంలో పరిపాటిగా మారింది. అయితే, గతం మాదిరిగా విదేశాల్లో ఉద్యోగాలు ఏమంతా ఆశాజనకంగా లేవు. మేన్ పవర్ సొసైటీలు రంగంలోకి దిగి సొమ్ము చేసుకుంటున్నాయి. అభ్యర్థులను పంపించి వారిపై కమీషన్లను దండుకుంటోంది. గతంలో నైపుణ్యం చూసి.. సదరు కంపెనీలు తమకు విదేశాల్లో ఉండే పరిశ్రమలకు పంపించేవి. విమాన టిక్కెట్లతో పాటు వీసా, వసతి ఇలా అన్నింటినీ సమకూర్చేవి. దీంతో విదేశాల్లో పనిచేయడం లాభసాటిగా ఉండేది. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతటా బ్రోకర్ వ్యవస్థ నడుస్తోంది. మేన్ పవర్ ఏజెన్సీలు, శిక్షణ సంస్థల మాటున విదేశీ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎంపిక చేసినందుకు కమీషన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎక్కువగా బోగస్ కంపెనీల పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.



స్థానికంగానే ఇంటర్వ్యూలు..

ఇచ్ఛాపురం పట్టణంలో బోగస్ సంస్థలు వెలుస్తున్నాయి. స్థానికంగానే అభ్యర్థులకు వెల్డింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. అరకొర శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఒకవేళ విదేశాలకు వెళ్లినా అక్కడ పని ఒత్తిడి తట్టుకోలేక తిరిగి వచ్చిన వారు ఉన్నారు. మరికొందరైతే అక్కడ వాతావరణ పరిస్థితులు అనుకూలించక మృత్యువాత పడుతుంటారు. అక్కడ పరిశ్రమల్లో కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారినపడుతుంటారు. చాలా మంది చనిపోతుంటారు. మరికొందరు క్షతగాత్రులుగా మిగులుతుంటారు. అటువంటి సమయంలో మృతదేహాలను స్వస్థలాలకు తెప్పించడం కత్తి మీద సాములా మారుతుంది. అక్కడ నిబంధనలు అడ్డంకిగా మారుతాయి. అటువంటి సమయంలో మృతదేహాల కోసం బాధిత కుటుంబ సభ్యులు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తుంది. అయితే బోగస్ సంస్థలే ఎక్కువగా మోసాలు చేస్తున్న దృష్ట్యా వాటిపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది.

● గతంలో విదేశాల్లో వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్‌గా ఉద్యోగాల కోసం విశాఖ గాజువాకలో ఇంటర్వ్యూలు జరిగేవి. క్రమేపీ ఇప్పుడు జిల్లా కేంద్రాలు, ఆపై మండల కేంద్రాలకువ విస్తరించాయి. ముఖ్యంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలతో పాటు ఒడిశాకు దగ్గరగా ఉండడం వల్ల ఇచ్ఛాపురంలో ఎక్కువగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఇచ్ఛాపురంలో వారం వారం హోటళ్ల వద్ద పెద్ద ఎత్తున యువకులు కనిపిస్తుంటారు. చేతిలో బ్యాగు పెట్టుకొని పత్రాలతో వస్తుంటారు. అక్కడ వెల్డింగ్ మిషన్లు, ఇతరత్రా పరికరాలు కనిపిస్తుంటాయి. ఆరా తీస్తే విదేశాల్లో వెల్డర్, ఫిట్టర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు అని తెలుస్తుంది.

ఎటువంటి ఫిర్యాదులు అందలేదు..

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసపోయినట్లు మాకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. ఫిర్యాదు చేస్తే సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకుంటాం. బోగస్ సంస్థలపై నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి.

-మీసాల చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

ఎన్నాళ్లీ నరకం?

- పాతపట్నంలో నిలిచిన భూగర్భ డ్రైనేజీ పనులు
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ సర్కారు
- వీధుల్లోనే మురుగు నీరు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పాతపట్నంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ఆరేళ్ల కిందట నిధులు మంజూరైనా ఆ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. టీడీపీ ప్రభుత్వంలో మంజూరయ్యాయనే కారణంతో పనులు చేపట్టకుండా గత వైసీపీ నిర్లక్ష్యం చేసింది. దీంతో పాతపట్నంలో ఏ వీధిలో చూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. ఆ మురుగు మధ్యే ప్రజలు మగ్గిపోతున్నారు. ఒకపక్క దోమలు.. మరోపక్క తీవ్ర దుర్గంధంతో నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో పనులు పూర్తవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు



పాతపట్నం జూబ్లీ రోడ్‌లో దుర్గంధం

పాతపట్నం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం పాతప ట్నంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.21.34కోట్ల ఎన్ఆర్ఈజీఎస్, స్టేకవ్వర్జెన్ నిధులు సంయుక్తంగా మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో 2018 డిసెంబరులో అప్పటి టీడీపీ పాలకులు శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక నేతాజీ నగర్‌లో కూడా భూమి పూజ చేశారు. అయితే, పనులు ప్రారంభమైన అనతికాలంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో అవి అర్థాంతరంగా నిలిచిపోయాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు ఈ పనులను నిర్లక్ష్యం చేసింది. టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన కారణంగానే ఈ పనులు నిలిపి వేశారనే విమర్శలు ఉన్నాయి.

వీధుల్లోనే మురుగు

పాతపట్నంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో వీధుల్లోనే మురుగు నీరు పారుతుంది. పాతపట్నం పంచాయతీ పరిధిలో సుమారు 25వేల వరకు జనాభా ఉన్నారు. 95 వీధులు ఉన్నాయి. అయితే, పంచాయతీ పరిధిలో 47 కిలోమీటర్ల నిడివిలో భూగర్భ డ్రైనేజీల నిర్మాణానికి టీడీపీ పాలనలో నిధులు మంజూరైనా పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో మురుగు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీనికితోడు వైసీపీ పాలనలో జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇంటింటికీ కొళాయిల కోసం వీధుల్లోని సీసీ రోడ్లను ఇష్టారాజ్యంగా దొలిచేశారు. దీనివల్ల వాహనాలు అందులో కూరుకుపోయి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క ఆలాంధ్ర రోడ్, పాతపట్నం జూబ్లీ రోడ్డులో కాలువలు పూడికపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. కూటమి ప్రభుత్వం స్పందించి భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని పాతపట్నం ప్రజలు కోరుతున్నారు.



అమ్మవారి గుడి కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పాతపట్నంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. అందుకే గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయించాం. కానీ, వైసీపీ ప్రభుత్వం ఈ పనులను పూర్తిచేయకుండా వదిలేసింది. మళ్లీ ఈ పనులు పునఃప్రారంభించాలని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

-పైల బాబ్జీ, టీడీపీ మండల అధ్యక్షుడు, పాతపట్నం.

యూఎస్ ఎన్నికల్లో మనోళ్ల ఓట్లు

టెక్కలి/హిరమండలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో జిల్లాకు చెందిన కొంత మంది ప్రవాస భారతీయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ట్రంప్ విజయం సాధించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్నాం



శ్రేయ,శృతి

హిరమండలానికి చెందిన సింహాద్రి సాయిరాం గత పాతికేళ్లుగా అమెరికాలో ఐటీ ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబంతో పాటు అక్కడే ఉంటున్నారు. ఆయన ఇద్దరు కుమార్తెలు శ్రేయ, శృతిలు ఫోన్‌లో మాట్లాడుతూ.. అధ్యక్ష ఎన్నికల్లో మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ విజయం అమెరికా -భారత్ సంబంధాల్లో కొత్త శకానికి నాంది పలకాలి. అమెరికాలో ఉన్న తెలుగు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, భద్రతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తారని ఆకాంక్షిస్తున్నాం.

కమలా హారిస్ గెలుస్తుందని అనుకున్నాం



అమెరికా ఎన్నికల్లో భారత్ మూలాలున్న డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ గెలుస్తుందని అనుకున్నాం. కమలా హారిస్ గెలిస్తే భారతీయ గ్రీన్‌కార్డ్ హోల్డర్లకు వీసా సమస్య పరిష్కారానికి మోక్షం లభిస్తుందని ఆశించాం. మొత్తంగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌దే పైచేయి అయ్యింది. కమలా హారిస్ నాయకత్వం కోసం మరో ఐదేళ్ల వేచిఉండక తప్పదు.

- అన్నెపు శ్రీనివాసరావు, న్యూజెర్సీ(అమెరికా), టెక్కలి మండలం బలరాంపురం


వరి పైరులో కేళీలు

- పంట చేతికందే సమయంలో గుర్తింపు
- కల్తీ విత్తనాలే కారణమంటున్నరైతులు

6లో



ముందే గుర్తిస్తే మేలు



- ప్రాథమిక స్థాయిలో చికిత్స అందిస్తే సేఫ్
- జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు
- చెడు వ్యసనాలు, జంక్ ఫుడ్డే కారణం
- అవగాహన లేక నిర్లక్ష్యం.. ఆపై మూల్యం
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

జిల్లాలో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఏటేటా పెరుగు తుండడం ఆందోళన కలి గిస్తోంది. ప్రాథమిక స్థాయిలో వ్యాధిని గుర్తించకపోవడంతోనే మరణాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ లక్షణాలు బయట పడుతుండడంతో ఆందోళనకు కారణమవుతోంది. ప్రపంచ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు అవగాహన పెంచుతున్నా.. ప్రజల్లో నిర్లిప్తత, నిర్లక్ష్యంతో మూల్యం చెల్లించుకో వాల్సి వస్తోంది. ప్రజల్లో చైతన్యం అంతంత మాత్రంగానే ఉంది. నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

రణస్థలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)

- రణస్థలానికి చెందిన ఓ యువకుడు దంత క్యాన్సర్‌కు గురయ్యాడు. కానీ వ్యాధిని గుర్తించడంలో కుటుంబసభ్యులు జాప్యం చేశారు. స్థానికంగా ఉన్న ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించారు. నోటి నుంచి విపరీతంగా రక్తస్రావం కావడంతో శ్రీకాకుళంలోని ఓ వైద్య నిపుణుడు వద్ద చూపించగా క్యాన్సర్ అని తేలింది. కానీ అప్పటికే వ్యాధి ముదరడంతో కొద్దిరోజులకే ఆ యువకుడు మృత్యువాత పడ్డాడు.
- రణస్థలం మండలంలో ఓ గ్రామానికి చెందిన మహిళ రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ మృత్యువాత చెందింది. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో గైనిక్ సమస్యగా భావించి స్థానిక వైద్యులతో చికిత్స చేయించారు. తీరా తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వెంటనే శ్రీకాకుళం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రొమ్ము క్యాన్సర్ అని అక్కడ వైద్యులు తేల్చారు. దీంతో విశాఖ తరలించగా ఆమె అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందారు.
- జేఆర్ పురం గ్రామానికి చెందిన ఓ యువకుడిలో క్యాన్సర్ లక్షణాలు కనిపించాయి. వెంటనే స్పందించిన కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు విశాఖ తరలించగా అక్కడ కిమో థెరపీ వైద్యం అందించారు. క్రమం తప్పకుండా థెరపీలు అందించడంతో యువకుడు తేరుకున్నాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

క్యాన్సర్ ప్రధాన కారణం వ్యసనాలు, ఆహార అలవాట్లు. క్యాన్సర్ కారక కణాలను నిర్వీర్యం చేసేందుకు కీమో థెరపీ, రెడియో థెరపీ అందించాలి. అది కూడా సకాలంలో గుర్తించి అందించాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో చికిత్స అందిస్తే ప్రాణాలతో బయటపడొచ్చు. ల్యాప్రోస్కోపిక్ తరహాలోనే కీహోల్ సర్జరీలు సైతం నేడు అందుబాటులోకి వచ్చాయి. సర్జరీ తరువాత చికిత్స అయిపోదు. క్రమేపీ వైద్య పరీక్షలు చేసుకుని దానికి తగ్గట్టు వైద్యసేవలు పొందాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో క్యాన్సర్‌కు వైద్యం లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోంది. శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మాత్రమే వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ నెలకు 800 నుంచి 900 వరకూ క్యాన్సర్ బాధితులు శస్త్రచికిత్సలు, కిమోథెరపీలు చేయించుకుంటున్నారు. అయితే జిల్లాలో క్యాన్సర్ వైద్యం అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది విశాఖ కేజీహెచ్, మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

● బాధితుల్లో పురుషులు, మహిళలు..

జిల్లాలో పురుషుల్లో దంత కేన్సర్, ఊపిరితిత్తులు, చిన్నప్రేగు క్యాన్సర్‌కు గురవుతున్నారు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. అయితే క్యాన్సర్‌కు ప్రధాన కారణం మాత్రం వ్యసనాలే. ప్రధానంగా గుట్కా, పాన్, మసాలా తినడం, పొగ తాగడంతోనే వ్యాధి బారిన పడుతున్నారు. అతిగా మద్యం తాగడం, జంక్ ఫుడ్ తినడం కూడా వ్యాధి సంక్రమించడానికి కారణం. ఫాస్టుఫుడ్ సెంటర్లు, హోటళ్లలో వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడడంతో వ్యాధి కారకాలు శరీరంలోకి వ్యాపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు బాల్య వివాహాలు కూడా క్యాన్సర్‌కు కారణమని తెలుస్తోంది. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల ప్రసవాల సమయంలో హర్మోన్ల ప్రభావంతో గడ్డలు ఏర్పడి అవి క్యాన్సర్‌గా మారుతున్నాయి. అదే సమయంలో ఆలస్యంగా వివాహమయ్యే మహిళలు సైతం ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. మంచి బలవర్థకమైన ఆహారం తీసుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్స్ తీసుకోకూడదు. అదే సమయంలో వ్యాయామం, యోగా వంటివి చేయాలి.

క్యాన్సర్ లక్షణాలు ఇవే..

క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఇలా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అతిగా బరువు తగ్గిపోవడం క్యాన్సర్ తొలి లక్షణం. ఒకేసారి కొందరు ఐదు నుంచి పది కిలోలు తగ్గిపోతారు. అటువంటి వారు వైద్యపరీక్షలు చేసుకోవాలి. క్యాన్సర్ బారినపడిన వారిలో తరచూ జ్వరం వస్తుంది. దాని ప్రభావం శరీరీ అవయవాలపై పడుతుంది. విశ్రాంతి తీసుకున్నా అలసట వెంటాడుతుంది. అదే పనిగా అలసిపోవడం వ్యాధికి సంకేతం. శరీరంలో మార్పులు కూడా వస్తాయి. ముఖ్యంగా నల్లగా మారిపోవడం వ్యాధికి సంకేతం. కళ్లు పసుపు మచ్చగా మారిపోయి జాండీస్ వస్తుంది. చర్మం ఎర్రగా మారి జుట్టు ఎక్కువగా పెరిగిపోవడం కూడా సంకేతమే. మలబద్ధకం, డయేరియా సైతం నిరంతరంగా ఉంటుంది. ఇది కూడా వ్యాధి లక్షణమే. గాయాలు మానకపోవడం, పుట్టుమచ్చలు పుండుగా మారి రక్తం కారడం, నోట్లో దీర్ఘకాలిక మార్పులు రావడం కూడా ఒక కారకమే. మల మూత్రం ద్వారా రక్తస్రావం జరిగితే అది కేన్సర్ లక్షణంగా గుర్తించాలి. శరీరంలో ఏదైనా భాగం గట్టిగా మారిపోయినా అది సంకేతమే. తిన్నప్పుడు మింగడం కష్టతరంగా మారుతుంది. చాలా పదార్థాలను మింగలేం. అది కూడా వ్యాధి కారక లక్షణమేనని గుర్తించాలి. విపరీతమైన దగ్గు, గొంతు బొంగురు పోవడం వంటివి వ్యాధి లక్షణాలు. ఇవేవీ కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

ప్రాథమిక స్థాయిలో గుర్తించాలి..

క్యాన్సర్ వ్యాధికి గురైన వారు భయాందోళన చెందాల్సిన పనిలేదు. ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్యం అందిస్తే తప్పకుండా నయం అవుతుంది. అయితే వ్యాధి సోకిన వారు 4,5 దశల్లో గుర్తిస్తున్నారు. అప్పుడు వైద్యసేవల కోసం ఆస్పత్రులకు వెళుతున్నారు. ఆ సమయంలో వైద్యానికి వారి శరీరం సహకరించదు. అందుకే వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళితే చాలా మంచిది.



-సనపల నరసింహమూర్తి, వైద్యుడు, శ్రీకాకుళం

మీకు తెలుసా?

అరసవల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతీ ఆరు నిమిషాలకు ఒకరు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారు. ఇందులోనూ రొమ్ము క్యాన్సర్ మరణాలు దేశంలో ప్రతీ 13 నిమిషాలకు ఒకటి సంభవిస్తున్నాయి. 2022 లెక్కల ప్రకారం దేశంలో 8.08 లక్షల క్యాన్సర్ మరణాలు ఉన్నట్లు చెబుతున్నారు. దేశంలో ప్రతీ 4 నిమిషాలకు ఒక బ్రెస్ట్ క్యాన్సర్ కేసు నమోదవుతోంది.

- జిల్లాలో క్యాన్సర్‌కు సంబంధించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్సలు అందుబాటులో లేవు. వ్యాధి నిర్ధారణకు సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పాప్ స్మియర్ పరీక్షలు మాత్రమే ఉన్నాయి. బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారించే మామ్మోగ్రామ్ పరీక్షకు కూడా లేదు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులపైనే పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి. అధికశాతం మంది రెఫర్‌పై విశాఖపట్నం వెళ్తున్నారు.

ప్రతీ ఒక్కరూ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి..



ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే 90 శాతం నివారణ చేయవచ్చు. 40న సంవత్సరాలు దాటిన ప్రతీఒక్కరూ సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలో ఎక్కువగా స్త్రీలలో రొమ్ము కేన్సర్ కేసులు 2 లేదా 3వ స్టేజ్‌లోను, అలాగే పురుషుల్లో ఎక్కువగా నోటి కేన్సర్ కేసులు చివరి దశలోనూ వస్తున్నాయి. మరణాలు కూడా అధికంగా సంభవిస్తున్నాయి. దీనికి అవగాహన లోపమే ప్రధాన కారణం. జిల్లాలో క్యాన్సర్ రోగులు చికిత్స కోసం విశాఖపట్నం వెళ్లిపోతున్నారు. రిమ్స్‌లో ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పాప్ స్మియర్ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయాయం చేయడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకర ఆహారపు అలవాట్ల ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు.

-డాక్టర్ రవీంద్ర, క్యాన్సర్ వైద్య నిపుణులు, రిమ్స్ ఆసుపత్రి, శ్రీకాకుళం

బిడ్డకు అభయమేదీ!



- జిల్లాలో అధికమవుతున్న శిశు మరణాలు
- గిరిజన గ్రామాల్లోనే అధికం
- తల్లులూ మృత్యుబారిన పడుతున్న వైనం
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినం



దబ్బగుడ్డిలో డోలీపై గర్భిణిని కొండలు దించుతున్న దృశ్యం (ఫైల్)



దబ్బగుడ్డికి రహదారి లేని దృశ్యం

మెళియాపుట్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మాతా శిశుమరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఏటా ఈ మరణాల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తుంది. ముఖ్యంగా గత వైసీపీ పాలనలో తల్లీబిడ్డ మరణాల సంఖ్య ఎక్కువగా నమోదైంది. ఎక్కడా మాతా శిశు మరణాలు జరగకూడదు, బాలింతలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోండి అంటూ తరచూ వైద్యశాఖ సమీక్షల్లో జిల్లా కలెక్టర్లు చెబుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ ఏడాది ఆగస్టు వరకు 7 మాతృ మరణాలు, 11 శిశు మరణాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, లెక్కలోకి రానివి 20 వరకు ఉండవచ్చునని తెలుస్తుంది. గురువారం ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

గత ఐదేళ్లూ వదిలేశారు..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ప్రజా వైద్యాన్ని గాలికి వదిలేసింది. విలేజ్ క్లినిక్ పేరిట ప్రతి కుటుంబానికీ ఇంటి వద్దే వైద్యం అంటూ గొప్పలు చెప్పింది. దీనికోసం రూ.కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపింది. కానీ, వాస్తవంగా ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందలేదు. గర్భిణులకు ప్రతి 15 రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు చేస్తామని, హైరిస్కు గర్భిణుల కోసం గ్రామాల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ, ఎక్కడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో గర్భిణుల నమోదు ప్రక్రియ, వారి ఆరోగ్య పరిస్థితిని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది గుర్తిస్తున్నారు. తర్వాత వైద్యులు పరీక్షిస్తున్నారు. కాన్పు సమయానికి ముందే ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నా మాతా శిశు మరణాలు మాత్రం ఆగడం లేదు. అయితే, కొందరు గిరిజన గర్భిణులు మాత్రం ఆస్పత్రులకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు. ప్రసవ సమయంలో ఆసుపత్రికి రావాలని ఆశ, ఏఎన్ఎంలు కోరుతున్నా వారు రావడం లేదు. కాన్పులపై అవగాహన లేక ఇంటి వద్దే డెలివరీ చేయించుకుంటున్నారు. దీంతో మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రసవం కోసం ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు పారితోషికం ఇచ్చేవారు. దీంతో పాటు తల్లీబిడ్డను వాహనంలో క్షేమంగా వారి ఇంటి వద్దే దించేవారు. అయితే, గత వైసీసీ ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మాతాశిశు మరణాలు ఎక్కువగా నమోదయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించలేదు. దీంతో అత్యవసర సమయాల్లో 108 వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినా ప్రయోజనం కనిపించటం లేదు. కనీసం ద్విచక్ర వాహనమైనా వెళ్లే పరిస్థితి లేక గర్భిణులను డోలీపై కొండలు దించి ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. దీనివల్ల కొన్నిసార్లు మార్గమధ్యలో ప్రసవాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని గిరిజనులు అందోళన చెందుతున్నారు.

గత మూడేళ్లుగా అధిక మరణాలు..

జిల్లాలో గత మూడేళ్లుగా మాతాశిశు మరణాల సంఖ్య అధికంగా నమోదైంది. 2019-20లో 39,073 జననాలు నమోదు కాగా, శిశుమరణాలు 432, మాతృమరణాలు 23 జరిగినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. 2020-21లో 39,898 జననాలకు గాను శిశుమరణాలు 469, మాతృ మరణాలు 24 జరిగాయి. 2021-22 లో 40,170 జననాలు కాగా 246 శిశు, 36 మాతృ మరణాలు సంభవించాయి. 2023-24లో 71 శిశు మరణాలు జరిగినట్లు వైద్యశాఖ అధికారులు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆగస్టు వరకు 7 మాతృ, 11 శిశు మరణాలు జరిగాయి.

గర్భిణులకు వసతి గృహాలు..

మాతా శిశుమరణాలను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాలను వైసీపీ సర్కారు మూసేసింది. ఈ వసతి గృహాలను మళ్లీ పునః ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన గిరిజన శాఖ సమీక్షలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రసవానికి నెల రోజుల సమయం ఉందనగా గర్భిణులను ఈ వసతి గృహాలకు తీసుకువస్తారు. అక్కడ 24 గంటలూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. నిరంతరం వైద్య పరీక్షలు చేస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారు. అలాగే, గర్భిణులకు మంచి పౌష్టికాహారం అందజేస్తారు. దీనివల్ల మాతా శిశు మరణాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.


గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు..



కూటమి ప్రభుత్వం గిరిజన గర్భిణుల కోసం వసతి గృహాలు ఏర్పాటు చేస్తుండడం ఆనందంగా ఉంది. వెంకటాపురం పంచాయతీ దబ్బగుడ్డి గ్రామానికి రహదారి లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో వైద్యంతో పాటు చదువుకోవడానికి గ్రామస్థులు నాలుగు కిలోమీటర్లు నడుచుకుని మైదాన ప్రాంతాలకు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలి.

-బి.లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు, మెళియాపుట్టి

మాతాశిశు మరణాలు తగ్గించాలి..



గిరిజన గ్రామాల్లో మాతాశిశు మరణాలు తగ్గించాలి. అధికంగా రహదారులు లేకపోవడంతో సకాలంలో గర్భిణులను ఆస్పత్రులకు తీసుకెళ్లలేక మరణాలు సంభవిస్తున్నాయి.

-చల్లా శాంతారావు, గిరిజన సంఘం నాయకుడు, మెళియాపుట్టి

వరి పైరులో కేళీలు

- పంట చేతికందే సమయంలో గుర్తింపు
- కల్తీ విత్తనాలే కారణమంటున్న రైతులు



జమ్ము గ్రామంలో తన పొలంలో కేళీలను చూపిస్తున్న అన్నదాత

నరసన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల నోటిలో వ్యాపారులు మట్టి కొట్టారు. 20 కేజీల బస్తాను.. అందంగా ప్యాకింగ్ చేసి.. బ్రాండెండ్ కంపెనీ కవర్ అతికించారు. ఈఏడాది ఖరీఫ్‌లో వీటినే రైతులకు విక్రయించారు. పంట కోతకు వచ్చిన దశలో అధికంగా కేళీలు ఉండటంతో రైతులు ఖంగుతిన్నారు. దీంతో తాము మోసపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో కొందరు ప్రైవేటు డీలర్లు.. ఈఏడాది జూన్‌లో ప్రముఖ కంపెనీల లేబుళ్లను అతికించి నకిలీ విత్తనాలను రైతులకు విక్రయించారు. 20 కేజీల బస్తాను.. రూ.1400కు అమ్మి అడ్డగోలుగా దోచుకున్నారు గత మూడు సంవత్సరాలుగా స్వర్ణకు ప్రత్యామ్నాయంగా రైతులు 333, అమూల్య స్వర్ణ, సంపద స్వర్ణ, మార్టురు స్వర్ణ, 1210 రకాలను నాట్లు వేస్తున్నారు. చీడలు, తెగుళ్లను తట్టుకుంటాయని ఈరకాల విత్తనాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో జిల్లాలో కొందరు వ్యాపారులు.. బ్రాండెండ్ కంపెనీలను పోలిన సంచులను తయారుచేసి అందులో రూ.300 విలువ చేసే ధాన్యం ప్యాక్‌చేసి రూ.1600 వరకు విక్రయించారు. దీనివల్లే కేళీలు ఎక్కువగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.
- జిల్లాలో ఈఏడాది 3.67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో 60 శాతం మేరకు ఎదలు వేయగా.. 40 శాతం ఊబాలు చేపట్టారు. అధికారులు రైతుసేవా కేంద్రాలు ద్వారా సాంబ, స్వర్ణ వంటి సాధారణ రకాలను పంపిణీ చేశారు. 333, అమూల్య, సంపద స్వర్ణ వంటి రకాలను ప్రైవేటు డీలర్లు నుంచి రైతులు కొనుగోలు చేశారు. నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి తదితర పట్టణాల్లో రైతులు బ్రాండెడ్ అని నమ్మి డీలర్ల వద్ద కొనుగోలు చేశారు. అయితే డీలర్లు వీటికి బిల్లులు ఇవ్వలేదు. 20 మెట్రిక్ టన్నుల వరకు ఇలా విత్తనాలు అమ్మినట్లు తెలుస్తోంది. తొలుత విత్తనాలు మొలక రావడంతో మంచివేనని కొనుగోలు చేశారు. తీరా పంట చేతిక అందిన సమయంలో కేళీలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేళీలతో దిగుబడులు తగ్గుతున్నాయి..



ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించినా వరి పొట్టదశలో వర్షాలు పడటం, కొందరు వ్యాపారులు కేళీల విత్తనాలు విక్రయించడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. పంట చేతికి అందిన సమయంలో కేళీలు (గింజలేని వడ్లు) తొలగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మరోక వైపు పూతికలు (నల్లని ధాన్యం) కూడా పంటలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

-సాధు సూర్యనారాయణ, రైతు

భారీ స్కోర్ దిశగా ఉత్తరాఖండ్

- విజయనగరంలో రంజీ క్రికెట్ మ్యాచ్

విజయనగరం టౌన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో బుధవారం నుంచి ప్రారంభమైన రంజీ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు భారీ స్కోర్ దిశగా దూసుకుపోతుంది. బీసీసీఐ ఆధ్వర్యంలో అంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆతిథ్యం ఇస్తున్న నాలుగు రోజుల మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ కెప్టెన్ సమర్థ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఓపెనర్లు అవినీష్ సుధ, పీఎస్ ఖండూరీల తొలి వికెట్ నష్టపోయే సమయానికి 157 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. అవినీస్ సుధా 158 బంతుల్లో 12 ఫోర్లతో 86 పరుగులు సాధించి లలిత్ మోహన్ బౌలింగ్‌లో ఆంధ్రా కెప్టెన్ రషీద్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. అనంతరం ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ సమర్థ్ 30 పరుగులు (నాటౌట్), ఖండూరీ 107 పరుగులు (నాటౌట్) సాధించారు. అంతేకాకుండా ఆట ముగిసే సమయానికి ఇరువురు అజేయంగా 75 భాగస్వామ్యం నెలకొల్పి క్రీజ్‌లో ఉన్నారు. పర్యాటక జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 232 పరుగులు సాధించింది. ఆంధ్రా బౌలర్లు ఎంత ప్రయత్నించినా మరో వికెట్ సాధించలేకపోయారు.







ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన వైసీపీ

అరసవల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం స్థానిక విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేషన్, గ్రామాల పరిధిలో కనీస మౌలిక సదుపాయాల కల్పన కూడా గత ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. శ్రీకాకుళాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే విజయవాడలో ఈ నెల 13న ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవి శంకర్ గురూజీతో జరిగే మహాసత్సంగ్ కార్య క్రమానికి అందరూ హాజరు కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు సందీప్, సురేం ద్రలతో కలిసి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సరుబుజ్జిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం మూలసవలాపురం పంచాయతీలో రూ.58.35 లక్షలు, పెద్ద సవలాపు రం పంచాయతీలో రూ.87 లక్షలతో చే పట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిరాణా లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు తర్లాడ ఈశ్వరరావు, పల్లి సురేష్ అధ్యక్షతన ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి పాలకవర్గం దోచుకో దాచుకో అనే విధంగా చేశారన్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రహదారులను గుంతల రహిత రోడ్లుగా మార్చడానికి సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కూటమి నాయకులు తర్లాడ సురేంద్ర, శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, అంబళ్ల రాంబాబు, ఎంపీడీవో ఎం.పావని, ఏపీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు.


మూలసవలాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


రణస్థలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

భూ సమస్యల పరిష్కారానికే..

రణస్థలం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం బంటుపల్లి గ్రామంలో రెవెన్యూ సభలు నిర్వహించారు. సర్వేలో జరిగిన లోపాలు ఉంటే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నడుకుదిటి రజిని, తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, సర్వేర్ రవి, ఆర్ఎస్‌డీటీ టి.శ్రీదేవి తదితరు పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లే లక్ష్యం

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రోడ్లుగా తీర్చి దిద్దటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం ప్రభుత్వం చేపట్టిన గుంతలు లేని రోడ్ల కార్యక్రమానికి భూమి పూజ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తులసిగాం నుంచి బూర్జుపాడు వరకు గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దేందుకు రూ.24.5 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈదుపురంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నాయకులు డి.ఢిల్లీరావు, సాడి సహదేవ్ రెడ్డి, డి.కామేష్, అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొయ్యరాళ్ల జంక్షన్ సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

హెచ్ఐవీపై అవగాహన

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ అవగహన ఉండాలని ప్రాజెక్ట్ మేనేజర్ మాధవరావు అన్నారు. వైసీబీ (యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం) పట్టణ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల, బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు కళాజాత సూర్యకుమారి బృందం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్‌కుమార్ పాడి, హెచ్ఎం పద్మవల్లి, హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్, శ్రావణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాలపరిమితి రద్దుచేయాలి

ఎచ్చెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వెలుగు సంస్థలో పనిచేస్తున్న వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితిని రద్దుచేయాలని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎ.మహాలక్ష్మి అన్నారు. ఎచ్చెర్లలోని ఏపీఎం కార్యాలయ అధికారికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. వీవోఏ సంఘ నేతలు అన్నపూర్ణ, రాజేశ్వరి, ఉత్తర, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే విక్రయించాలి

సోంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలు ఎంఆర్‌పీ ధరకే అమ్మాలని, లేకుంటే కేసులుతప్పవని ఎక్సైజ్ సీఐ కె.బాబీ తెలిపారు. స్టేషన్‌లో ఆమె బుధవారం విలేకరలతో మాట్లాడారు. మద్యం షాపుల్లో పర్మిట్స్ ఉండకూడదని తెలిపారు. షాపుల్లో ధరల పట్టీతప్పనిసరిగా ఉండాలని సూచించారు.

అర్చకులకు సన్మానం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ధర్మశాస్త్ర సన్నిధాన ట్రస్ట్ అయ్యప్పస్వామి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషి మాత అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మను సన్మానించారు.


ఖననం చేస్తున్న గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో కొండముచ్చు మృతి

- అంత్యక్రియలు చేపట్టిన బూరగాం గ్రామస్థులు

కంచిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బూరగాం జాతీయ రహదారి కూడలి వద్ద బుధవారం ఉదయం కారు ఢీకొని కొండముచ్చు (కోతి) మృతి చెందింది. గమనించిన గ్రామస్థులు మడ్డు తిరుపతిరావు, పరపతి జగదీష్, బుడ్డ మహేష్, వంక రమణ, ఆబోతు ఢిల్లీరావు, మణి పాత్రోలు కొండముచ్చు కళేబరాన్ని గ్రామ సమీపంలో పూడ్చిపెట్టారు. కొండముచ్చు కళేబరానికి పూజలు చేశారు. ఈ ప్రాంతంలో అండర్ పాసేజ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కంచిలి నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కంచిలి జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సూరిశెట్టి అఖిల రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం సీతారాం, పీడీ రోజారమణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్టోబరు 22న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అఖిల ప్రతిభ చూపింది. ఈ నెల 8 నుంచి మూడురోజులు పాటు అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అఖిల పాల్గొంటుందన్నారు. కిషోర్, కృష్ణారావు తదితరులు అఖిలను అభినందించారు.

ప్రణాళికల తయారీపై శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక తయారీ ప్రక్రియకు సంబంధించిన జిల్లా స్థాయి టీవోటీల రెండో రోజు శిక్షణ జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో బుధవారం జరిగింది. రెండో శిక్షణలో ఈ-గ్రామస్వరాజ్, పీఎఫ్ఎంఎస్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

ఉద్యోగావకాశాలపై శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విమెన్ కెరీర్ ఏజెన్సీ ద్వారా మహిళలకు ఉద్యోగావకాశాల కల్పనపై బుధవారం స్థానిక మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, హోమ్ స్టాఫ్‌కు శిక్షణ నిర్వహించారు. ఎల్ఐసీ, పోస్టల్ డిపార్ట్‌మెంట్ల భాగస్వామ్యంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ సుబ్బారావు, డీవో శ్రీనివాసులు అవగాహన కల్పించారు. 'సుకన్య సమృద్ధి యోజన' ఆవశ్యకతపై వివరించారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలతో మేలు

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్దాన ప్రాంతం ప్రజలు కిడ్నీ మహమ్మారితో ఇబ్బందిపడుతున్నారని, వీటితో రకాల సమస్యలు తోడవుతున్నాయని, ఈ సమయంలో ముందస్తుగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడం ఎంతో మంచిదని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లెట ఆధ్వర్యంలో విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో మహిళల కోసం నిర్వహించిన మెగా ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యులతో మాట్లాడి క్యాన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాలి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పట్టణ కార్యదర్శి నందకి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, వార్డు కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, సీపాన రమణ, దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, కాళ్ల జయదేవ్, కొరాయి ధర్మరాజు, రాజు పుల్లెట, రెయ్యి జానికిరావు, శేఖర్, డి.కామేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.దేవేంద్ర రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

సారా నియంత్రణకు ప్రత్యేక బృందాలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సారాతో పాటు బెల్టు షాపులను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 29 నుంచి జిల్లా వ్యాప్తంగా 52 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. ఒడిశా మద్యం అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా సరిహద్దు ప్రాంతాల్లో బోర్డర్ మొబైల్ బృందాలు నియమించామన్నారు. సారా తయారు చేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసిమన్నారు. మద్యం ఎంఆర్పీ కంటే అధిక ధరలు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

12న బీఆర్‌ఏయూలో జిల్లా స్థాయి 'యువ ఉత్సవ్'

ఎచ్చెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యువతలోని ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఈ నెల 12న జిల్లా స్థాయి యువ ఉత్సవ్ నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉత్సవ్‌లో ఏడు కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని ఉత్సవ్ చైర్‌పర్సన్, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు గల యువతీ యువకులు ఈ పోటీలకు అర్హులన్నారు. ప్రతి విద్యార్థి ఒక కేటగిరీలోనే పాల్గొనాల్సి ఉంటుందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో నూతన ఆలోచనలు పేరిట నిర్వహిస్తున్న రెండు పోటీల్లో వ్యక్తిగతంగా, అలాగే ఐదుగురు సభ్యులు బృందంగా పాల్గొనవచ్చని చెప్పారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పంచప్రాణ్ అంశంపై పద్యం, చిత్ర లేఖనం కేటగిరీలో యువ కళాకారులకు పోటీ లు, ఇదే అంశంపై జరిగే ఫొటోగ్రఫీ, వక్తృత్వ పోటీలు జరుగుతాయని తె లిపారు. పది మంది సభ్యుల బృందంగా జాన పద నృత్య ప్రదర్శనలో పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు గతంలో యువ పార్ల మెంట్‌లో గాని, నెహ్రూ యువకేంద్రం నిర్వ హించిన జాతీయ స్థాయి పోటీల్లో గాని పాల్గొని ఉండరాదన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారికి క్యాంపస్‌లో భోజన, వసతి కల్పిస్తామని, ఎలాంటి టీఏలు, డీఏలు చెల్లించమన్నారు. ఆధార్‌కార్డు జెరా క్స్ కాపీతో ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 91330 95645, 63045 20703 ఫోన్ నెంబర్లలో, అలాగే dyc.srikakulam@ gmail.comలో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్‌ఏయూ వీసీ కేఆర్ రజని, నెహ్రూ యువకేంద్రం అధికారి కె.వెంకట ఉజ్వల్ పర్యవేక్షిస్తారని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజే యడంతో పాటు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికచేస్తారని చెప్పారు.

శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న శానిటరీ మేస్త్రీలను రాజకీయ వేధింపులతో విధుల నుంచి తొలగించారని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ శానిటరీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరు పతిరావు, ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శానిటరీ వర్కర్లు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చాలాకాలంగా విధులు సక్రమంగా నిర్వహిస్తు న్నా, వారిపై ఏవిధమైన ఫిర్యాదులు లేనప్పటికీ కూటమి ప్రభుత్వ వచ్చిన వెంటనే రాజకీయ వేధింపులతో మేస్త్రీలు పి.మోహన్‌కృష్ణ, పి.రా ము, ఎ.ఉపేంద్రరావుకు ఎటువంటి షోకాజ్ నోటీసులు, మెమోలు ఇవ్వకుండానే అకారణం గా విధుల నుంచి తొలగించడం అన్యాయ మన్నారు. కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ఎం.రామారావు, మున్సిపల్ నాయ కులు జె.గురుమూర్తి, పార్థసారథి, గణేష్, కల్యాణి, రామచంద్ర, తారక తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళ చేస్తున్న దృశ్యం

కార్మికుల ఔదార్యం

ఎచ్చెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ (అరిణాం అక్కివలస)లో పనిచేస్తున్న కార్మికుడు సుతారి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన కుటుంబంపై కార్మికులు చూపిన ఔదార్యానికి పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, హెచ్‌పీడీ హెడ్ కె.శ్యాంప్రసాదరావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అభినందించారు. ఈ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఒక్క రోజు వేతనంతో పాటు గ్రాట్యూటీతో కలిపి రూ.12,76,052 రాజేష్ భార్య సుందరమ్మకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, సీహెచ్ సత్యనారాయణ, జె.నూకరాజు, పి.చిన్న, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

గుజరాతీపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. తీవ్ర ఒత్తిడితో పశ్చిమగోదావరి జిల్లాలో ఓ హెచ్ఎం గుండెపోటుతో మరణించడంతో ఏపీటీఎఫ్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. గతేడాది లీడర్‌షిప్ ట్రైనింగ్ జరిగిందని, ప్రస్తుతం అందరు హెచ్ఎంలు ఆపార్ నమోదు, పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్ ఫీజు చెల్లింపు తదితర కార్యక్రమాలతో బిజీగా ఉన్నారని, ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధి పనులపై నేడు సమీక్ష

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో పలు అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సమీక్షిస్తారని కమిషనర్ ఎన్.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులంతా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పట్టాలు రద్దుచేసే ప్రయత్నం మానుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం, మేఘవరం, ఉమిలాడ పంచాయతీల్లో గత ప్రభుత్వం ఇచ్చిన హుద్‌హుద్ ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి, వాటిని ఇతరులకు అమ్ముకోవడానికి మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న ప్రయత్నం మానుకోవాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. బు ధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సంతబొమ్మాళి ఎంపీపీ ఎం.అప్పారావు తదితరులు ఉన్నారు.

నేడు జాబ్ మేళా

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఇన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్‌పాడి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27 సంవత్సరాల లోపు ఉన్న యువతీ, యువకులు అర్హులన్నారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో పీక కోసుకున్న వ్యక్తి

● ప్రాణాలు కాపాడిన వైద్యులు

టెక్కలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భార్యతో తరచూ తగాదాలు, మద్యం అలవాటు ఎక్కువగా ఉన్న నందిగాం మండలం కొత్తగ్రహారం గ్రామానికి చెందిన బొండాడ రామారావు బుధవారం మద్యం మత్తులో కత్తితో పీక కోసుకున్నాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. డ్యూటీలో ఉన్న వైద్యులు ప్రధానో రామారావు గొంతుక నుంచి అధిక రక్తస్రావం అవుతుండడంతో జాగ్రత్తగా శస్త్రచికిత్స చేసి ప్రాణా లు కాపాడారు. రామారావు ప్రాణాలు కాపాడిన వైద్యుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

సముద్రంలో వేటకు వెళ్లి..

● విశాఖలో కొత్తపేట మత్స్యకారుడి మృతి


జగదీష్ (ఫైల్)

వజ్రపుకొత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు గడుపల్లి జగదీష్ (40) విశాఖపట్నంలో చేపల వెళ్లి బోటు ప్రమాదంలో మృతి చెందాడని మండల మత్స్యశాఖాధికారి రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖపట్నంలో ఈనెల 3న చేపల వేటకు వెళ్లిన జగదీష్ బోటు ప్రమాదంలో సముద్రంలో పడి పోయాడని, 4న మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం సాయంత్రం కొత్త పేటలో ఆయన కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించామన్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన జగదీష్ మృతితో ఆ కుటుంబాన్ని ప్రభు త్వం ఆదుకోవాలని ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు.

పార్క్ చేసి ఉన్న కారు దగ్ధం

శ్రీకాకుళం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశాఖ-బి కాలనీలో సాయిబాబా మందిరం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేసిన ఓ కారు మంగళవారం అర్ధరాత్రి దాటాక కాలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఓవ్యక్తి తాకట్టులో కొనుగోలు చేసిన కారులో విశాఖ-బి కాలనీలో ఉంటున్న తన బావ ఇంటికి వెళ్తుండగా అది ఆగిపోయింది. దీంతో సాయిబాబా కోవెల వద్ద ఉన్న ఖాళీ స్థలంలో కారును ఉంచి వెళ్లిపోయాడు. అయితే అదే రోజు సాయంత్రం అక్కడ చెత్త తగల బెట్టగా ఆ ప్రాంతంలోనే కారును పార్క్ చేయడంతో మంటలు చెలరేగి కారు దగ్ధ మైందని స్థానికులు చెబుతున్నారు. మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్ని మాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. ఏడీఎఫ్‌వో సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అంద లేదని రూరల్ పోలీసులు తెలిపారు.

నగరంలో అగ్నిప్రమాదం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిన్నెర థియేటర్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ స్థలం ఖాళీగా ఉండడంతో స్థానికులు, వర్తకులు అక్కడ చెత్త వేయడంతో ఏదోలా అగ్గి రాజుకుని పెద్ద ఎత్తున మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఏడీఎఫ్‌వో వరప్రసాద్ తన సిబ్బందితో చేరుకుని మంటలు అదుపు చేశారు.

రెండు తులాల పుస్తెల తాడు చోరీ

పాతపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొరసవాడ రెడ్డిక వీధిలో మంగళవారం రాత్రి బంగారం చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అమర శ్రీలత తన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి పడుకుని ఉండగా సుమారు రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి ఆమె మెడలోని రెండు తులాల పుస్తెలతాడును తెంచుకుని పారి పోయాడు. బాధితురాలు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్‌ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

కోటబొమ్మాళి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కురుడు గ్రామానికి చెందిన జలుమూరు ధనమయ్యపై దంత గ్రామానికి చెందిన భార్య, అత్తమామలు దాడిచేసి గాయపరిచారని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దశమయ్యకు భార్య పావనితో కొంతకాలంగా విభేదాలు ఏర్పడి ఆమె కన్నవారిల్లు దంత గ్రామానికి వెళ్లిపోయింది. అయితే కుమారుడికి ఆధార్ కార్డు అవసరమై భార్యని అడిగేందుకు దశమయ్య బుధవారం దంత గ్రామానికి వెళ్లగా గత విభేదాలను దృష్టిలో ఉంచుకుని భార్య పావని, మామ బొమ్మాళి మహలక్ష్మి, అత్త ఆదిలక్ష్మి దాడి చేసి చితకబాదారని బాధి తుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని వీవోఏల ధర్నా

కొత్తూరు, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వెలుగు సంస్థలో పనిచేస్తున్న మా సమస్యలను తక్షణం పరిష్కరించాలని యానిమేటర్ల (వీవోఏ) యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సతివాడ బాలామణి, గొర్లె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యానిమేటర్లు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కొత్త వీవోఏలకు వేతనాలు చెల్లించాలన్నారు. ఈ ధర్నాకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు బెనర్జీ, పి.చిన్నమ్మడు, జి.ధనలక్ష్మి, డి.జయంతి, డి.మణికుమారి, చందు, సుమ, శ్రావణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి

మెళియాపుట్టి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి లాంగ్‌జంప్ పోటీలకు పెద్దమడి గురుకుల కళాశాల విద్యార్థి ఎం.కృష్ణారావు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదనరావు తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో కృష్ణారావు త్రిపుల్ జంప్ 12.28 మీటర్లలో గోల్డ్‌మెడల్, లాంగ్ జంప్‌లో 5.84 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. త్వరలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. కృష్ణారావును ప్రిన్సిపాల్ మధుసూదనరావు, పీడీ లక్ష్మణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

24 నుంచి శతచండీ సహిత రుద్రయాగం

కోటబొమ్మాళి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు శతచండీ సహిత రుద్రయాగ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆలయ ప్రధాన అర్చకులు సుసరాపు గణపతి శర్మ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ ఆగమ పండితులు, యాజ్ఞికులు అంపోలు రుద్రకోటేశ్వర శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

జాబ్‌మేళాలో 147 మంది ఎంపిక

పలాస/టెక్కలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పలాస, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం జేకేసీ, అంజనా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. పలాసలో 40 మంది, టెక్కలి లో 107మంది విద్యార్థులు ఎంపికైనట్లు అంజనా ఫౌండేషన్ ఛైర్మన్ నవీన్ బచ్చు తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సతీష్ కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ గణపతిరావు, సమన్వయకర్తలు రమణ, లూక్‌పాల్ పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో శ్రద్ధ తీసుకోవాలి

ఎల్.ఎన్.పేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే రైతులు విత్తనాల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కొత్తూరు డివిజన్ ఏడీఏ బి.రాజగోపాల్ అన్నారు. చొర్లంగి రైతుసేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్సీ వ్యవసాయాధికారులు వై. సూర్యకుమారి, శిరీష, ఏవో పి.లతాశ్రీ, సర్పంచ్ ఎస్.గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

కోటబొమ్మాళి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసే వేరుశనగ, మినప, పెసర విత్తనాలను రైతులకు నిమ్మాడ రైతు సేవా కేంద్రంలో ఏడీఏ బీవీ తిరుమలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ బుధవారం అందజేశారు. ఏవో ఎస్.గోవిందరావు, సర్పంచ్ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

రూ.460 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

● నియోజకవర్గంలో 74వేల కొళాయిల ఏర్పాటు లక్ష్యం

● ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

టెక్కలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెక్కలి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సురక్షిత మైన తాగునీరం దిస్తానని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీ అమలులోకి రానుంది. ఈ మేరకు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ అంశంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జల్‌జీవన్ మిషన్ కింద ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఆ శాఖాధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.460 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి మంత్రికి అందించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి నియోజకవర్గంలో సుమారు 3.45 లక్షల జనాభాకు గాను సుమారు 471 హేబిటేషన్లుగా విభజించి 74 వేల కొళాయిలు వేసేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం.


గొట్టా బ్యారేజీ నుంచి..

టెక్కలి మండలంలో ప్రస్తుతం తాగునీరందిస్తున్న 28 గ్రామాలు మినహాయించి మిగిలిన 94 గ్రామాలతో పాటు నందిగాం మండలంలో 128, సంతబొమ్మాళి మండలంలో 126, కోటబొమ్మాళి మండలంలో 123 గ్రామాలను కలుపుతూ 56 కిలోమీటర్లు పైపులైన్, ఇంటర్నల్‌గా 600 కిలోమీటర్ల పైపులైన్లు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించారు. హిరమండలం సమీపంలోని గొట్టాబ్యారేజీ నుంచి నీటిని తరలించి బొంతు జంక్షన్ వద్ద కొండ సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించి గ్రావిటీ రూపంలో అక్కడి నుంచి కొత్తపేట కొండపైన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడి నుంచి పైపులైన్ల ద్వారా గ్రామాలకు పైప్‌లైన్లు వేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ నుంచి ఉద్దానం ప్రాంతానికి ఎలాగైతే నీటి సరఫరా జరుగుతోందో, అదే తరహా గొట్టాబ్యారేజీ నుంచి టెక్కలి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరందించనున్నారు. దీంతో నియోజకవర్గంలో తాగునీటి ఇక్కట్లు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరందించేందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

'అపార్'ను వేగవంతం చేయాలి

నరసన్నపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అపార్‌లో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియను వేగవంతంచేయాలని, ఈ సమయంలో ఏవైనా సమస్యలు ఏర్పడితే సర్వశిక్షాభియాన్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఎస్ఏ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఉమ సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈవోలు, క్లస్టర్ రిసోర్సు మొబైల్ టీచర్లతో సమావేశం నిర్వహించారు. యూడైస్‌లో ఈపీ, జీపీలు అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జీసీడీవో నీరజ, ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు, సీఆర్టీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

నరసన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదులో ఉపాధ్యాయుల అలసత్వం లేదని కేవలం ఆధార్‌లో లోపాల వల్ల జాప్యం జరుగుతోందని, అయితే ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్‌లో లోపాలకు విద్యార్థుల తల్లిదండ్రులు కారణమని, వాటిని సరిచేయించే బాధ్యత వారిపైనే ఉంటుందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మర్రిపాడు అమరవీరుల స్మారక స్థూపంవద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈనెల 22న అమరవీరుల స్మారక సభను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాలను విడుదల చేశారు. ప్రజాసంఘాల నాయకులు కుసుమ, సార జగన్, అప్పయ్య పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

మెళియాపుట్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 17 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించి, వేతనాలు పెంచాలని జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకుడు శ్రీనివాసరావు కోరారు. బుధవారం మెళియాపుట్టిలో సంఘ సమావేశం నిర్వహించారు. సమస్యలను ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయ కులు సింహాచలం, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేటినుంచి గ్రామదేవత ప్రతిష్ఠోత్సవాలు

హరిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లిమెరక గ్రామంలో గ్రామస్థులు నిర్మించిన గ్రామదేవత చింతలపోలమ్మ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితుడు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

పెంటూరులో..

నందిగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెంటూరులో నూతనంగా నిర్మించిన తాటిపోలమ్మ తల్లి మందిరం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామ స్థులు తెలిపారు. గురువారం సాయంత్రం అమ్మవారి విగ్రహ తిరువీధి నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠతో పాటు సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించు కోవాలని కోరారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం: ఎమ్మెల్యే బగ్గు


గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతితో పాటు సాధికారిత సాధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం మహిళలకు దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉచిత సిలిండర్ల పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహనకుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నేతలు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పిదాల సవరణకే గ్రామసభలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పిదాలనుసరిచేసి రైతులకు న్యాయం చేసేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అంగూరులో బుధవారం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అన్యాయం జరిగితే సహించేది లేదు

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ఎంజీఆర్


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలపై ఇచ్చిన అర్జీలపై ఏం చర్యతీసుకున్నారో వారం రోజుల్లో అడి గి తెలుసుకోవాలని అర్జీదారులకు సూచించారు. అలాగే వచ్చిన సమస్యలపై 15 రోజుల్లోగా చర్యలు తీసుకుని ఆ వివరాలను సంబంధిత అధికారులు దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 367 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, టీడీపీ నేతలు పైల బాబ్జీ, మడ్డు రామారావు, సైలాడ సతీష్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మినీ విత్తన కిట్ల పంపిణీ

సాగులో ఆధునిక విధానాలను పాటించడం ద్వారా వ్యవసాయరంగాన్ని లాభదిగా మార్చుకో వచ్చని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మినుము వీబీఎన్-8 రకం విత్తనాల కిట్లను బుధవారం పంపిణీచేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


డిపో గేటు వద్ద నినాదాలు చేస్తున్న ఈయూ నాయకులు

పలాస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు అవసరమైన ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని, గతంలో రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులను పునరుద్ధరించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏపీపీటీడీ ఈయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిపో కార్యాలయం ఎదుట గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్నాయన్న కారణంగా ఆర్టీసీ బస్సులు రద్దు చేశారని, దీంతో ప్రైవేటు సర్వీసులు తిరుగుతున్నాయని, వాటికి నష్టాలుండవా అని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ప్రజా రవాణా సదుపాయాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు ఎంఏ రాజు, కార్యదర్శి ఏడీకుమార్, టీసీ హెచ్ రావు, జీకే రాజు, వీడీరావు, సీఎల్ నారాయణ, బి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ తగ్గించడం దారుణం

కాశీబుగ్గనవంబరు6(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్లకు గడచిన 68 ఏళ్లుగా ఒకే విధమైన కమీషన్ ఇచ్చారని, అయితే ఇటీవల కమీషన్ బాగా తగ్గించడం దారుణమని ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ తీసుకున్న పలు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ 36 రోజులుగా చేపడుతున్న నిరసనల్లో భాగంగా బుధవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా సంఘం బ్రాంచి అధ్యక్షుడు జినగ రాజేంద్రనాయుడు మాట్లాడుతూ.. పాలసీలపై జీఎస్టీని ఎత్తి వేయాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలని డిమాండ్ చేశారు. ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంస్థ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ వైస్‌ప్రెసిడెంట్ వి.ఈశ్వరరావు, బ్రాంచి ట్రెజరర్ బి.వాసుదేవరావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ బి.రుక్మాంగదరరావు, సీనియర్ ఏజెంట్లు ఎన్.ప్రకాశరావు, రామమూర్తి, శ్యామసుందరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డివిజన్‌స్థాయి శిక్షణ

పలాసరూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో గురువారం డివిజన్‌స్థాయి 'గ్రామ పంచాయతీల ప్రణాళిక' అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ రెండురోజుల పాటు జరుగుతుందన్నారు.

డా.యయాతి మృతికి 'బగ్గు' సంతాపం

జలుమూరు (సారవకోట), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డా.మెండ యయాతి మృతికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సంతాపం తెలిపారు. యయాతి (73) బుధవారం తెల్లవారుజామున నరసన్నపేటలో మృతి చెందగా సాయంత్ర స్వగ్రామం బుడితిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరా మర్శించి ఓదార్చారు. రోగులకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సారవకోట, పోలాకి, నరసన్నపేట, హరిపురం, పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాధికారిగా పనిచేసిన యయాతి విధులు నిర్వహించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. యయాతి మృతి చెందిన విషయం తెలుసుకుని పలువురు గ్రామస్థులు సంతాపం వ్యక్తంచేశారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

టెక్కలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, అధ్యాపకులు కోటేశ్వరరావు, త్రినాథరావు, ధర్మారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

15 నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

● కల్యాణచక్రవర్తి, తహసీల్దార్



పలాస రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఎన్. కల్యాణచక్రవర్తి తెలిపారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని సాగునీటి సంఘాలున్నాయి. ఏ కేటగిరికి చెందినది?

జవాబు: మండలంలో 15 నీటి సంఘాలుండగా, వాటిలో 10 మేజర్, 5 మైనర్ సంఘాలుగా గుర్తించాం.

ప్ర: రైతు ఓటర్ల వివరాలు వెల్లడించారా? అభ్యంతరాలు ఏ తేదీన తెలుపవచ్చు?

జ: రైతుల నుంచి చేర్పులు, మార్పులు స్వీకరించడం జరిగింది. ఈనెల 11న జాబితా విడుదల చేస్తాం. 13న అభ్యంతరాలు తెలియజేయవచ్చు. 14న ఆర్డీవో పరిధిలోకి పంపించడం జరుగుతుంది.

ప్ర: ఎన్నికలు ఎప్పుడు జరుపుతారు?

జ: ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్ష, టీసీ మెంబర్ల ఎన్నిక జరుగుతుంది.

న్యూస్ బాక్స్

'పల్లెపండగ' పనులు పూర్తిచేయాలి

మెళియాపుట్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లెపండగలో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. బుధవారం ఎంపికైన వెండర్లతో సమావేశం నిర్వహించారు. మండలానికి రూ.5.26 కోట్లతో 85 పనులు మొదటి విడతలో మంజూరయ్యా యన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు బూర్లె లలిత కుమారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను సిద్ధం చేయండి

నందిగాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు సూచించారు. బుధవారం కార్యాల యంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్, మైనర్ నీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితాలను ఎటువంటి విమర్శలకు తావివ్వకుండా తయారుచేసి శుక్రవారం నాటికి అందించాలన్నారు. ఇరిగేషన్ ఏఈ ఎం.రాంబాబు, ఆర్ఐ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలపై సమావేశం

పోలాకి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలపై వీఆర్వోలతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ తెలిపారు. సాగునీటి సంఘాల సభ్యులు, ఓటర్ల జాబితాలో ఓటర్లు, మృతులు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. రానున్న సాగునీటి సంఘాల ఎన్నికల ప్రణాళికపై సమీక్ష ఉంటుందన్నారు. వీఆర్వోలంతా సకాలంలో హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.